ఉద్యోగాల పేరుతో ఖాకీ చీటింగ్

- సోదరుడితో కలిసి రూ.30 లక్షలకు పైగా వసూలు
- ఎంతకాలమైనా ఉద్యోగాలు రాకపోవడంతో స్పందనలో ఫిర్యాదు చేసిన బాధితులు
- జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చోడవరం పోలీసులు కేసు నమోదు
- విశాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రధాన నిందితుడు

- 8లో

జల జీవన్ మిషన్ పనుల్లో ఇష్టారాజ్యం

ప్రతిపాదనలకు భిన్నంగా పనులు

- నిధులు దుర్వినియోగం
- కాంట్రాక్టర్లపై లోపించిన అధికారుల పర్యవేక్షణ





సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర అశోక్

- జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యుల ధ్వజం
- జడ్పీటీసీ సభ్యులకు గౌరవం వేతనం ఏదీ?
- అనకాపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టానికి లంచం అడుగుతున్నారని ఫిర్యాదులు
- ఏజెన్సీలోని చింతపల్లి, అరకులోయ ఆస్పత్రుల్లో డయాలసిస్ రోగులకు సేవలు అందించాలని డిమాండ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కొళాయిల ఏర్పాటు ద్వారా ఇంటింటికీ నీరు అందించే జలజీవన్ మిషన్ పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారని జిల్లా పరిషత్ సభ్యులు ఆరోపించారు. పనుల చేపట్టిన కాంట్రాక్టర్లు, పర్యవేక్షించే అధికారుల్లో జవాబుదారీతనం లేదని ధ్వజమెత్తారు. బుధవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. జలజీవన్ మిషన్ పనులపై చర్చను చైర్‌పర్సన్ ప్రారంభిస్తూ ఏజెన్సీలో చేపడుతున్న పనుల్లో నాణ్యతా లోపాలు ఉన్నాయన్నారు. టెండర్‌లో పొందు పరిచిన విధంగా కాకుండా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు దుర్వినియోగమం అవుతున్నాయన్నారు. చింతపల్లి జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనుల్లో నాణ్యత లేదన్నారు. హుకుంపేట, డుంబ్రిగుడ జడ్పీటీసీ సభ్యులు రేగా మత్స్యలింగం, చాత్రాయి జానకమ్మ మాట్లాడుతూ ప్రతిపాదనల్లో పేర్కొన్న మేరకు ఇంటింటికీ కొళాయిలు వేయడం లేదని, బోర్ల తవ్వకాల్లో కూడా అవకతవకలకు పాల్పడుతున్నారన్నారు. గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకటగిరిబాబు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం విఫలమైందని, మోటార్లు పనిచేయడం లేదని, కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా మంజూరుకావడం లేదన్నారు. రాంబిల్లి జడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు మాట్లాడుతూ ఈ పథకంలో సొమ్ములు సరిపోవడం లేదని పంచాయతీల నుంచి కొంత మొత్తం తీసుకున్నారని చెప్పగా, బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు మాట్లాడుతూ ఇంటింటికీ కొళాయిల కోసం రోడ్లు తవ్వి వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సభ్యుల ప్రశ్నలకు గ్రామీణ నీటి సరఫరా విభాగం ... మిగతా 7వ పేజీలో

ఇళ్ల స్థలాలు అమ్ముకుంటున్నా చర్యలు లేవు

- 7లో

- జగనన్న లే అవుట్‌లలో సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలాలు ఆక్రమణ
- ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువు
- బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడి ఆరోపణ

కలెక్టర్ సుమిత్‌కుమార్ బదిలీ



సుమిత్‌కుమార్



ఎం.విజయసునీత

- పశ్చిమ గోదావరి జిల్లాకు నియామకం
- కొత్త కలెక్టర్‌గా విజయసునీత
- పౌరసరఫరాల శాఖ నుంచి రాక

పాడేరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో రాష్ట్ర పౌర సర ఫరాల శాఖలో డైరెక్టర్‌గా పని చేస్తున్న ఎం.విజ యసునీత నియమితులయ్యారు. పాడేరు కేంద్రంగా 2022 ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం 'అల్లూరి సీతారామరాజు' పేరుతో కొత్త జిల్లాను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్న సుమిత్‌కు మార్‌కు (2104 బ్యాచ్) పదోన్నతి కల్పిస్తూ అల్లూరి జిల్లాకు తొలి కలెక్టర్‌గా ప్రభుత్వం నియ మించింది. జాతీయ రహదారికి భూ సేకరణ, అటవీ హక్కుల చట్టం అమలు, చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని గోదావరి ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టడడంలో సుమిత్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. అలాగే జిల్లాలోని ఆదిమ జాతి గిరిజనులను ఓటర్లుగా నమోదు చేయడానికి ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ఇటీవల ఎన్నికల కమిషన్ ఉత్తమ జిల్లా కలెక్టర్‌గా గుర్తించింది. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి మరో రెండు నెలల్లో రెండేళ్లు పూర్తి కావస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసింది.

కొత్త కలెక్టర్‌గా విజయసునీత

సుమిత్‌కుమార్ బదిలీతో ఆయన స్థానంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో డైరెక్టర్‌గా పని చేస్తు న్న విజయసునీతను (2104 బ్యాచ్) నియమిం చారు. ఆమె తొలుత ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఇన్‌క్యాప్)లో స్పెషల్ డిప్యూటీ కలెక్ట ర్‌గా, ఏలూరు మునిసిపల్ కమిషనర్‌గా పని చేశారు. అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో డైరెక్టర్‌గా చేస్తూ తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. వాస్తవంగా విజయసునీత గ్రూప్-1 అధికారిణి. సీనియారిటీ మేరకు 2014లో ఆమె ఐఏఎస్ (కన్‌ఫార్మ్‌డ్) పొందారు.

మగువల చేతుల్లో జిల్లా పాలన పగ్గాలు

కలెక్టర్, జేసీ, సబ్‌కలెక్టర్.. మూడు ప్రధాన పోస్టుల్లో మహిళలు

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ స్థానంలో ప్రభుత్వం ఎం.విజయసు నీతను నియమించడంతో జిల్లా పాలనకు సంబంధించి ప్రధాన పోస్టుల్లో మహిళలు వుండడం అరుదైన విషయం. జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన శివశ్రీనివాస్‌ను గత నెల 31న బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో భావన వశిష్ఠను నియమించిన విషయం తెలిసిందే. అదే విధంగా గత ఏడాది డిసెంబరు చివరి వారంలో ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ బాధ్యతల నుంచి అభిషేక్‌ను తప్పించి ఐఏఎస్ శిక్షణ పూర్తిచేసుకున్న ధాత్రిరెడ్డిని ప్రభుత్వం నియమించింది. తాజాగా జిల్లా కలెక్టర్‌గా విజయ సునీత నియమితులయ్యారు. దీంతో జిల్లాకు ఒకేసారి కలెక్టర్, జేసీ, సబ్‌కలెక్టర్ వంటి మూడు ప్రధాన పోస్టుల్లో మహిళా అధికారులు వుండడం విశేషమని రెవెన్యూ వర్గాలు అంటున్నాయి.



జాయింట్ కలెక్టర్ భావనవశిష్ఠ



సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి



శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనంలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ప్రమాదంలో చదువులు

- శిథిలావస్థకు చేరిన చుట్టుబంద పాఠశాల భవనం
- మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు వినతి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కొయ్యూరు, ఫిబ్రవరి 14: మండలంలోని కినపర్తి పంచాయతీ చుట్టు బంద ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. అధికారులు మరో భవనం నిర్మించకపోవడం, కనీసం దీనికి మరమ్మతులు చేయించకపోవడంతో గత్యంతరం లేక ఈ భవనంలోనే పాఠశాలను నిర్వహిస్తున్నారు. భవనానికి మరమ్మతులు చేయించాలని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు.

చుట్టుబందలో ప్రాథమిక పాఠశాల భవనాన్ని సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో పది మంది విద్యార్థులు వున్నారు. నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో పదేళ్లకే లోపాలు బయటపడ్డాయి. గోడలు నెర్రెలిచ్చాయి. వర్షం కురిస్తే శ్లాబ్ నుంచి నీరు కారుతున్నది. మనబడి నాడు-నేడు కార్యక్రమం రెండు విడతల్లో కూడా ఈ పాఠశాలను చేర్చలేదు. ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఈ గ్రామానికి వచ్చారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం గురించి ఆమెకు వివరించారు. కొత్త భవనానికి నిధులు మంజూరు చేయించాలని, లేకపోతే నాడు-నేడు కార్యక్రమంలో చేర్చి భవనానికి మరమ్మతులు అయినా చేయించాలని కోరారు. కానీఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇదిలావుండగా తాను గత ఏడాది జూన్‌లో ఈ పాఠశాలకు బదిలీపై వచ్చానని, అంతకు ముందు ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుడు.. పాఠశాల అభివృద్ధి నిధులు ఖర్చుకు సంబంధించిన వివరాలను తనకు అప్పగించలేదని ఉపాధ్యాయుడు లక్ష్మణరావు చెబుతున్నారు. పాఠశాల భవనానికి వెంటనే మరమ్మతులు చేయించకపోతే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇందులో బోధన చేయటం కష్టమని, ఉన్నతాధికారులు స్పందించి తగుచర్యలు చేపట్టాలని ఉపాధ్యాయుడితోపాటు గ్రామస్థులు కోరుతున్నారు.





పగుళ్లిచ్చిన పాఠశాల భవనం గోడలు, ఊడిన శ్లాబ్ పెచ్చులు

ఉద్యోగులు, పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

పాడేరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌పై ఏపీ జేఏసీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు స్థానిక ఐటీడీఏ కార్యాలయం ముందు బుధవారం మధ్యా హ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేప ట్టారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. ఉద్యోగులు, పెన్షనర్ల సమస్య ల పరిష్కారం కోసం ఉద్యమ శంఖారావం పేరిట నిరసన కార్యక్రమాలు ప్రారంభించా మని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావా ల్సిన ఆర్థిక బకాయిలు, 11వ పీఆర్‌సీలో సమస్యలు పరిష్కారం, 12వ పీఆర్‌సీ అమలు చేయడం, ఉద్యోగులపై కక్షసాధిం పులు, వేధింపులు ఆపాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో డివి జన్ కమిటీ కార్యదర్శి ఎస్.సంజీవరాజు, పెన్షనర్ల సంఘం నేతలు రొబ్బా నాగభూ షణరాజు, జి.మోహనరావు, తిరుపతిరావు, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలకు చెందిన నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఐటీడీఏ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, పెన్షనర్లు



జమున పద్ధతిలో రాగి విత్తనాలు వేస్తున్న రైతు మంగ్లు (ఫైల్ ఫొటో)

శభాష్ మంగ్లు!

రాగి దిగుబడిలో గిరిజన రైతు రికార్డు

- 'జమున' పద్ధతిలో సాగు
- ఎకరానికి 13 క్వింటాళ్లు

చింతపల్లి, ఫిబ్రవరి 14: మండలంలో చిన్నగెడ్డ గ్రామానికి చెందిన మర్రి మంగ్లు అనే గిరిజన రైతు రాగి(చోడి) సాగులో రికార్డు సాధించాడు. 'జమున' పద్ధతిలో రాగి సాగు చేపట్టి ఎకరాకు 13 క్వింటాళ్ల దిగుబడి పొందాడు. మూడేళ్లగా ఈ విధానం రాగి సాగు చేస్తున్న ఇతను తొలి రెండేళ్లు ఎకరానికి 11-12 క్వింటాళ్ల దిగుబడి సాధించాడు. ఈ సంవత్సరం ఆ రికార్డును అధిగమించాడు. సాధారణంగా ఏజెన్సీ రైతులు రాగి సాగులో 5-6 క్వింటాళ్ల దిగుబడి పొందుతుంటారు. అయితే 'జమున' పద్ధతిలో సాగు చేస్తే సాధారణ పద్ధతిలో కంటే 60 శాతం అధిక దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

చింతపల్లి మండలం చిన్నగెడ్డ గ్రామానికి మర్రి మంగ్లు, అతని భార్య బత్రిలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరికి ఏడున్నర ఎకరాల పొలం వుండగా.. ఇద్దరు కుమారులకు 1.5 ఎకరం చొప్పున మూడు ఎకరాలు పంపిణీ చేశాడు. మిగిలిన నాలుగు ఎకరాలను భార్యాభర్తలు సాగు చేసుకుంటూ వరి, చోడి, కూరగాయ పంటలు పండిస్తున్నారు. ఆరు పదుల వయస్సులోనూ మంగ్లు శాస్త్రీయ పద్ధతులు పాటిస్తూ ఉత్సాహంగా వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. చోడి సాగులో జమున పద్ధతిని పాటించి అధిక దిగుబడులు సాధించిన మంగ్లుకి 2021లో ఏపీ జీవవైవిధ్య మండలి వారు రాష్ట్ర స్థాయి ట్రెడిషనల్ కన్జర్వేషన్ యాక్టి విటీ అవార్డును అందజేశారు.

'జమున' పేరు ఎందుకు వచ్చిందంటే...

రాగి పంటలో గులి తరహా సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ఈ పద్ధతిలో సాగు చేసే రైతులు మడుల్లో విత్తనాలు చల్లి, నారును పెంచి, అనంతరం ప్రధాన పొలంలో నాటుతారు. అయితే ఈ ప్రక్రియ కొంత శ్రమతో కూడుకున్నది కావడంతో సంజీవని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు అమ్మాజీ సహకారంతో ముంచంగిపట్టు గ్రామానికి చెందిన వంతల జమున అనే మహిళ నేరుగా చోడి ... మిగతా 8వ పేజీలో



మంగ్లు సాగుచేస్తున్న రాగి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్ ఫొటో)

ఏటా క్వింటా చొప్పున దిగుబడి పెరుగుతోంది



జడ్‌బీఎన్‌ఎఫ్ స్టేట్ రిసోర్స్ పర్సన్ అమ్మాజీ చెప్పినట్టు రాగి పంట సాగుచేపట్టాను. స్థానిక వ్యవసాయ అధికారి, అమ్మాజీ చెప్పినట్టే వివిధ స మయాల్లో యాజమాన్య పద్ధతులు చేపట్టాను. నేను 40 ఏళ్ల నుంచి రాగి పంటను సాగుచేస్తు న్నాను. జమున విధానం సాగు చేపట్టక ముందు వరకు ఎకరానికి ఆరు క్వింటాళ్లకు మించి దిగుబడి పొందలేదు. జమున పద్ధతిలో తొలిసారి 2021లో సాగుచేపట్టి ఎకరానికి 11 క్వింటాళ్ల దిగుబడి సాధించాను. 2022లో 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 13 క్వింటాళ్లకు పెరిగింది.

-మర్రి మంగ్లు, రైతు, చిన్నగెడ్డ



చింతపల్లిలో కురుస్తున్న మంచు

తగ్గని చలి తీవ్రత

- దట్టంగా కురుస్తున్న పొగమంచు
- జి.మాడుగులలో 5.8 డిగ్రీలు నమోదు

పాడేరు/చింతపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మన్యంలో చలి తీవ్రత కొనసాగుతున్నది. గత నాలుగు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతున్నాయి. అర్ధరాత్రి నుంచి ఉదయం పది గంటల వరకు పొగమంచు దట్టంగా కురుస్తున్నది. చలి తీవ్రత పెరగడంతో సాధారణ జనజీవనానికి ఆటంకం కలుగుతున్నది. మధ్యాహ్నం కొద్దిసేపు మినహా రోజులో మిగిలిన సమయమంతా వాతావరణం చల్లగా వుంటున్నది. ప్రజలు ఎక్కువ సేపు ఉన్ని దుస్తులు ధరించి చలిబారి నుంచి శరీరాన్ని కాపాడుకుంటున్నారు.

జి.మాడుగులలో 5.8 డిగ్రీలు

ఏజెన్సీలోని జి.మాడుగులలో బుధవారం 5.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అరకులోయ, జీకే వీధిలో 7 డిగ్రీలు, చింత పల్లిలో 7.5, పాడేరులో 7.8, పెదబయలులో 8.2, ముంచంగిపు ట్టులో 9.5, అనంతగిరిలో 10.6, డుంబ్రిగుడలో 11.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

క్రైం... crime news

పశువులను తరలిస్తున్న కంటైనర్ లారీ పట్టివేత

» 67 పశువులు స్వాధీనం... ఇద్దరి అరెస్టు


లారీ కంటైనర్‌లో ఉన్న పశువులు

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 14: మండలంలోని గెడ్డపాలెం రోడ్డు వద్ద జాతీయ రహదారిపై బుధవారం కబేలాలకు అక్రమంగా తరలిస్తున్న 67 ఆవులు, ఎద్దులను తరలిస్తున్న కంటైనర్ లారీని పట్టుకున్నట్టు ఎస్ఐ అట్టాడ విభీషణరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట సంత నుంచి విజయవాడ హనుమాన్ జంక్షన్‌కు వెళుతున్న కంటైనర్ లారీ మండలంలోని గెడ్డపాలెం రోడ్డు వద్ద ఆగి ఉంది. అదే సమయంలో పెనుగొల్లుకు చెందిన గో రక్షణ చారిటబుల్ ట్రస్టు సభ్యులు గొర్ల దేముళ్లు, ఆర్. లోవరాజు, ఎస్. దేముళ్లు బైక్‌లపై వెళుతుండగా కంటైనర్ లారీ నుంచి శబ్దాలు వినిపించాయి. దీంతో అక్కడ ఆగి కంటైనర్‌ను పరిశీలించిన ఆ ముగ్గురూ అనుమానం వ్యక్తం చేస్తూ డ్రైవర్‌ను డోర్ తెరవాలని కోరగా.. అందుకు అంగీకరించలేదు. దీంతో పలువురు స్థానికులతో కలిసి డోరు తెరిచి చూపించాలని, ఏమీ లేకపోతే పంపించేస్తామని గట్టిగా చెప్పడంతో డ్రైవర్ డోరు తెరిచాడు. దీంతో లోపల చూడగా డబుల్ డక్ టైపులో పశువులు ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమచారం ఇవ్వడంతో కొద్ది సేపటికి అక్కడికి చేరుకున్న పోలీసులు పశువులతో ఉన్న కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్, పశువుల తరలింపునకు చెందిన వ్యక్తిని అదుపులోకి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. అలాగే పశువులను గోశాలకు తరలించడం జరుగుతుందని ఎస్ఐ చెప్పారు.

చోడవరంలో యూట్యూబ్ విలేకరుల దందా

» పోలీసుల పేరుతో బెదిరింపులు
» వ్యాపారి నుంచి రూ.లక్షా 50 వేలు వసూలు
» మరో రూ.4 లక్షలు ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరింపులు
» పోలీసులకు ఫిర్యాదు ... నిందితుల అరెస్టు

చోడవరం, ఫిబ్రవరి 14 : పట్టణ పరిధిలో ఓ వ్యాపారి నుంచి పోలీసులమంటూ బెదిరించి రూ.లక్షా 50 వేలు వసూలు చేయడంతో పాటు, అతని నుంచి స్కూటీని బలవంతంగా ఎత్తుకు వెళ్లిన యూట్యూబ్ విలేకరులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పోలీస్ శాఖలో పని చేస్తూ కొంతకాలం క్రితం గంజాయి కేసులో ఇరుక్కుని సస్పెండ్ అయిన బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన వీర్ల నారాయణమూర్తి అలియాస్ నానాజీ, చోడవరం పట్టణంలోని ఎడ్ల వీధికి చెందిన కేతవరపు బెన్నిబాబు అలియాస్ బన్ని ఓ యూట్యూబ్‌కు విలేకరులుగా పనిచేస్తున్నారు. వీరితో పాటు ఎడ్లవీధికి చెందిన తమటపు వెంకట శివప్రసాద్, డెల్లి అప్పారావులు కలిసి ఇటీవల కాలంలో పలు చోట్ల విలేకరులు, పోలీసులమంటూ వసూళ్లదందా నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే పట్టణ శివారు గాంధీగ్రామంలో నివాసం ఉంటున్న చిరువ్యాపారి అలకుంట సాయిలు, అతని అల్లుడు ఆకుల శ్రీనులు గత నెల 27న చోడవరం నుంచి చీడికాడ వెళుతుండగా, తెల్లవారుజామున వారి వాహనాలను అడ్డుకున్న ఈ నలుగురూ తాము పోలీసులమని బెదిరించి వారి వద్ద ఉన్న రూ.లక్షా 50వేల నగదును బలవంతంగా తీసుకున్నారు. అలాగే, వారి వద్ద నుంచి స్కూటీ వాహనాన్ని కూడా గుంజుకుని వెళ్లిపోయారు. ఈ డబ్బులు కాకుండా మరో నాలుగు లక్షలు ఇవ్వాలని బాధితులను ఈ బృందం బెదిరించడంతో పాటు, డబ్బులు ఇవ్వకపోతే కుటుంబ సభ్యులను హతమారుస్తామని హెచ్చరికలకు పాల్పడ్డారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు యూట్యూబ్ విలేకరులైన నానాజీ, బెన్నిబాబులతో పాటు, వారికి సహకరించిన వెంకట శివప్రసాద్, డెల్లి అప్పారావులపై దోపిడీ కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నిందితుల నుంచి రూ.లక్షా 19వేల నగదుతో పాటు, స్కూటీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కాగా, అరెస్టయిన నిందితులలో వడ్డాదికి చెందిన నానాజీ గతంలో పోలీస్ శాఖలో హోంగార్డుగా పనిచేస్తూ ఓ గంజాయి కేసు వాహనానికి ఎస్కార్టుగా వ్యవహరించాడన్న ఆరోపణలపై సస్పెండైనట్టు సమాచారం. ఇటీవల కాలంలో యూట్యూబ్ విలేకరిగా మారి పలుచోట్ల దందాలు, బలవంతపు వసూళ్లు నిర్వహిస్తున్నారని పోలీసువర్గాల సమాచారం. ఇతనిపై గతంలో కూడా కేసులు నమోదైనట్టు చెపుతున్నారు.

జల జీవన్ మిషన్ పనుల్లో ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ఎస్.శివానందకుమార్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఈఈ లీలాకృష్ణ వివరణ ఇస్తూ నిబంధనల మేరకు కాంట్రాక్టర్లు పనులు చేయకపోతే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రస్తుతం గ్రామ స్థాయిలో కమ్యూనిటీ కాంట్రాక్టు కమిటీలకు పనులు అప్పగించామన్నారు. జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు జోక్యం చేసుకని జల జీవన్ మిషన్ పనుల వివరాలను గ్రామాల వారీగా బోర్డులు ఏర్పాటుచేసి ప్రజలకు తెలియజేయాలన్నారు.

ఆరు నెలలుగా జడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు అందడం లేదని చింతపల్లి సభ్యుడు పోతురాజు బాలయ్య ఆవేదన వ్యక్తంచేయగా...గత ఏడాది జూలై, ఆగస్టు నెలల బిల్లులు అప్‌లోడ్ చేశామని, ఆ తరువాత నెలల బిల్లులు ఇంకా మంజూరు కాలేదని సీఈవో తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖపై పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు మాట్లాడుతూ కంటి ఆపరేషన్లు నిర్వహించిన రోగులకు కళ్లద్దాలు పంపిణీ పూర్తిగా జరగలేదని ప్రస్తావించగా అనకాపల్లి డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్‌కుమార్ బదులిస్తూ దశల వారీగా అందజేస్తామన్నారు. మునగపాక జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట సోమసత్యనారాయణ మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించేందుకు లంచాలు తీసుకుంటున్నారని ఆరోపించగా అందులో వాస్తవాలు ఉన్నాయని బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు పేర్కొనడంతో...చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు. ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి మాట్లాడుతూ మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేయగా, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో కుక్కకాటు, పాముకాటుకు వ్యాక్సిన్ వేయడానికి సూదులు కొరత ఉందని జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ పేర్కొన్నారు.

చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ చోడవరం ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. కొయ్యూరు, అనంతగిరి జడ్పీటీసీ సభ్యులు వారా నూకరాజు, దేశరి గంగరాజు మాట్లాడుతూ కొందరు వైద్య సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని ఫిర్యాదు చేశారు. అనంతగిరి నుంచి రోగులకు అత్యవసర వైద్యం కోసం నేరుగా విశాఖకు తీసుకురావడానికి అంబులెన్స్ ఇవ్వడం లేదని గంగరాజు ఆరోపించగా, సమస్యను పరిష్కస్తామని 108 కో-ఆర్డినేటర్ హామీ ఇచ్చారు. కొయ్యూరు మండలాధ్యక్షుడు బి.రమేష్ మాట్లాడుతూ ఏజెన్సీలో డయాలసిస్ రోగులకు వైద్యం అందుబాటులో లేదని ఆందోళన వ్యక్తంచేశారు. కొయ్యూరు నుంచి నర్సీపట్నం ఆస్పత్రికి వస్తే రిజిస్టర్ చేసుకున్న 25 రోజుల తరువాత డయాలసిస్ చేస్తున్నారన్నారు. ఆయనతో జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఇతర సభ్యులు ఏకీభవిస్తూ ఏజెన్సీలోని చింతపల్లి, అరకులోయ ఆస్పత్రుల్లో డయాలసిస్ సదుపాయం కల్పించాలని అధికారులను కోరారు. ఏజెన్సీలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, సకాలంలో వైద్యం అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగా మత్స్యలింగం ఆందోళన వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు తక్షణ సేవలు అందించే యంత్రాంగం ఏర్పాటుచేయాలన్నారు. దీనికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందిస్తూ రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు అంబులెన్స్ సిబ్బంది కొంత వరకు ప్రాథమిక చికిత్స చేస్తారని, తీవ్రంగా గాయపడితే వెంటనే ఆస్పత్రిలో చేర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏజెన్సీకి చెందిన పలువురు జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ ప్రమాదాలు తగ్గేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర అశోక్, అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

అటవీ కలపకు కాళ్లు..!

» చెట్లను నిర్భయంగా నరికి తరలించుకుపోతున్న అక్రమార్కులు
» యథేచ్ఛగా ఈ తంతు సాగుతున్నా పట్టించుకునేవారు కరువు
» ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు వేడుకోలు


సరుగుడు అడవి నుంచి విలువైన కలప సైకిల్‌పై తరలింపు


అడవిలో కలపను కాల్చి.. బొగ్గుగా తయారు చేసి తరలించుకుపోతున్న దృశ్యం

నాతవరం, ఫిబ్రవరి 14: అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం అక్రమార్కులకు బాగా కలిసి వస్తోంది. ఫలితంగా ఇష్టారాజ్యంగా చెట్లను నరికి తరలించుకుపోతున్నారు. దీనిని కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టకపోవడంతో ఒకరిని చూసి మరొకరు అన్నట్టుగా అడువుల్లోకి చొరబడుతున్నారు. మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన సరుగుడు, అచ్చెంపేట ఫారెస్టుల్లో పట్టపగలే కొందరు నల్ల మద్ది, తంగేడు, వెదరు చెట్లను నరికి ముక్కలుగా కోసి బైక్‌లపై తరలించుకు పోతున్నారంటే.. దీని వెనుక ఎవరు ఉన్నారన్న అనుమానాలు అంతటా వ్యక్తమవుతున్నాయి. ఇంతలా ఈ తతంతు సాగుతున్నా విధుల్లో ఉన్న వెదురుపల్లి గార్డు గానీ, సరుగుడు బీట్ ఆఫీసర్‌గాని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే అచ్చెంపేట, రామన్నపాలెం తదితర గ్రామాలలో కొందరు జీడితోటలను నరికి ఆ కలపను సరుగుడు తారురోడ్డు పక్కనే వేస్తున్నారు. రాత్రి వేళల్లో లారీల్లో ఆ కర్రలను వేసేటప్పుడు మధ్యలో సరుగుడు ఫారెస్టులోని విలువైన కలపను కూడా తరలించుకునిపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే, అచ్చెంపేట దగ్గరలో విలువైన టేకు చెట్లు ఉన్నాయి. అప్పుడప్పుడు మధ్యలో ఉన్న టేకు చెట్లను నరికి రాత్రివేళ తరలిస్తున్నట్టు సమాచారం. కొందరు తరచూ సరుగుడు ఫారెస్టులో చెట్లను నరికి ఆ తర్వాత ఆ దుంగలను చమ్మచింత, నాతవరం, సరుగుడు తదితర గ్రామాలకు తరలించి అక్కడ టేకు కలపతో మంచాలు తయారు చేసి నర్సీపట్నం, తుని తదితర ప్రాంతాల్లో విక్రస్తున్నట్టు తెలిసింది. అలాగే కరకకొండ, పెడిమికొండపై ఉన్న చెట్లను కొందరు నరికేసి ఆ కలపను బట్టీల్లో కాల్చి బొగ్గును తయారు చేసి రోజూ బస్తాలకు బస్తాలు బైక్‌ల ద్వారా ఇతర ప్రాంతాలకు తీసుకు వెళుతున్నారు. పట్టపగలే ఈ తంతు సాగుతున్నా అడ్డుకట్ట వేసేవారు కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాదికారులు దృష్టి సారించకుంటే విలువైన అటవీ సంపద మరింత కనుమరుగు కావడం తథ్యమని పలువురు చెపుతున్నారు. ఈ విషయమై నాతవరం ఫారెస్టు అధికారి మహేష్‌ను వివరణ కోరగా, అడవిలో కలప తరలిపోతున్నట్టు తన దృష్టికి రాలేదన్నారు.



అచ్చెంపేట ఫారెస్టులో టేకు చెట్టు నరికేయడంతో మిగిలిన ఉన్న మోడులు

ఇళ్ల స్థలాలు అమ్ముకుంటున్నా చర్యలు లేవు

» జగనన్న లే అవుట్‌లలో సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలాలు ఆక్రమణ
» ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువు » బుచ్చెయ్యపేట జడ్పీటీసీ ఆరోపణ
» ఎటువంటి అక్రమాలు జరగలేదని జిల్లా హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ బదులు
» ఆగ్రహం వ్యక్తం చేసిన పలువురు సభ్యులు » సర్ది చెప్పిన విశాఖ జేసీ


సమావేశంలో హౌసింగ్ ఇన్‌చార్జి పీడీని ప్రశ్నిస్తున్న జడ్పీటీసీ సభ్యులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ తీరుపై జడ్పీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో గృహనిర్మాణ సంస్థ పురోగతిపై తొలుత అనకాపల్లి జిల్లా హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ రమామణి వివరించారు. ఈ దశలో బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు జోక్యంచేసుకుని బుచ్చెయ్యపేట మండలం వడ్డాది, మరికొన్ని గ్రామాల్లో ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలను కొందరు అమ్ముకున్నారని ఆరోపించారు. అలాగే, జగనన్న లే అవుట్‌లలో సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలాలను కొందరు ఆక్రమించుకుని దుకాణాలు నిర్మిస్తుండడంపై గతంలో ఫిర్యాదు చేశామన్నారు. ఇంటి స్థలాలను అమ్ముకున్న వ్యక్తులు అక్కడే ఇళ్ల నిర్మాణం కోసం సిమెంట్, ఇనుము, ఇసుక తీసుకున్నారని ఫిర్యాదుచేసినా ఫలితం లేకపోయిందని వివరించారు. జడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని వారం రోజుల్లో విచారించి నివేదిక ఇవ్వాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. ఈ దశలో పీడీ మాట్లాడుతూ బుచ్చెయ్యపేట మండలంలో జగనన్న కాలనీలపై రెవెన్యూ అధికారులు విచారించారని అయితే ఎటువంటి అక్రమాలు జరగలేదని తేల్చారని పేర్కొనగా, దొండా రాంబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా ఆమె వినిపించు కోకుండా మాట్లాడడంతో పరవాడ జడ్పీటీసీ సభ్యుడు సన్యాసిరాజుతో పాటు మరికొందరు లేచి పీడీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో సభ్యులు చెప్పిన విషయాలు తొలుత సావధానంగా విని, తరువాత వివరణ ఇవ్వాలే తప్ప వాగ్వాదానికి దిగడం మంచిది కాదని ఆగ్రహించారు. దీంతో విశాఖ జేసీ మయూర్‌అశోక్ జోక్యం చేసుకుని సభ్యులతో వాగ్వాదం మంచిది కాదని పీడీని మందలించారు. అప్పటికీ ఆమె ఏదో చెబుతుండంతో సభ్యులంతా ఒక్కసారిగా లేచి.. హౌసింగ్ పీడీ మాకొద్దు అంటూ తెగేసి చెప్పారు. జిల్లాలో చాలాచోట్ల పలువురు ఇళ్లు అమ్ముకుంటున్న వ్యవహారంపై విచారణ జరపాలని కోరగా జేసీ స్పందించి.. ప్రభుత్వం ఇచ్చే ఇళ్లను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని అనకాపల్లి డీఆర్వో దయానిధిని ఆదేశించారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గృహనిర్మాణ ప్రగతిపై అక్కడ పీడీ డి.బాబు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల కోసం సిమెంట్ నిల్వకు గోదాముల కొరత ఉందని పేర్కొన్నారు. జల వనరుల శాఖపై జరిగిన చర్చలో దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం మాట్లాడుతూ చెరువులు, కాల్వల ఆక్రమణపై ఫిర్యాదుచేస్తే ఎన్నికల విధులు తప్ప ఇతర విధులు చేయమని అక్కడ తహసీల్దార్ చెబుతున్నారన్నారు.

భూముల రీసర్వే పనులు పూర్తయిన తరువాత భూముల మధ్య సరిహద్దు రాళ్ల ఏర్పాటు లోపభూయిష్టంగా ఉందని ఫిర్యాదు చేయగా, చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపారు. మునగపాక మండలం గవర అనకాపల్లిలో కాలువలకు వేసిన షట్టర్లను దొంగలు ఎత్తు కుపోయి నెలలు గడిచినా ఇంత వరకు పట్టిం చుకోలేదని జడ్పీటీసీ సభ్యుడు సత్యనారాయణ ఆరోపించారు. కాగా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రాజ్యసభకు వెళుతున్నందున సభ్యులు అభినందించారు. ఇది లావుండగా ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, కరణం ధర్మశ్రీ తప్ప మిగిలిన ఎమ్మెల్యేలు హాజరుకాలేదు.

సంజీవయ్యకు నివాళి


సంజీవయ్య చిత్రపటం వద్ద కలెక్టర్ నివాళి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 14 : రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య చిరస్మరణీయులని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. శంకరంలోని కలెక్టరేట్ సమావేశమందిరంలో బుధవారం నిర్వహించిన సంజీవయ్య జయంతి వేడుకలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

సంజీవయ్య స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం సంజీవయ్య చిత్రపటానికి ఎస్పీ మురళీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అంజలి ఘటిస్తున్న ఎస్పీ

ఉత్తరాంధ్ర సమస్యలపై సమాచార సేకరణ

» 16 అంశాలపై ఆర్టీఐ ద్వారా దరఖాస్తులు
» రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన కొణతాల రామకృష్ణ

కొత్తూరు, ఫిబ్రవరి 14: ఉత్తరాంధ్ర ప్రధాన సమస్యలపై సమాచారాన్ని జనసేన నాయకుడు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ సేకరిస్తున్నారు. తనకు కావలసిన 16 ప్రధాన అంశాలపై సమాచారాన్ని కొణతాల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆర్టీఐ ద్వారా కోరారు. ఇందుకు సంబంధించి బుధవారం కొణతాల రామకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్రలోని 2014 నుంచి 2023 వరకు సాగునీటి ప్రాజెక్టులకు కేటాయించిన బడ్జెట్.. ఖర్చు ఎంత.. వంటి నిర్దిష్ట సమాచారాన్ని కోరారు. సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2019 జూన్ 1 నుంచి 2024 ఫిబ్రవరి 10వరకు నిర్వహించిన సమీక్షా సమావేశాలు, మినిట్స్ సమాచారాన్ని అడిగారు. 2019లో ఉత్తరాంధ్రలో సాగులో ఉన్న మెట్ట, మాగాణి, పంటభూమి ఎంత ఉంది.? ఈ సమాచారాన్ని పాత జిల్లాల వారీగా నిర్దిష్ట సమాచారాన్ని కోరారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయించాలని కేంద్రప్రభుత్వానికి, ప్రధానమంత్రికి, ఇతర కేంద్ర మంత్రులకు 2019 జూన్ 1 నుంచి 2024 ఫిబ్రవరి 4 వరకు ముఖ్యమంత్రి సమర్పించిన వినతిపత్రాలు, రాసిన లేఖలు, వాటికి వచ్చిన సమాధానాల వివరాలు తెలపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ఎంత నిధులు కేటాయించారు.. వాటిలో ఎంత మొత్తంలో ఖర్చు చేశారో కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ నిలిపివేయాలని కోరుతూ ప్రధానమంత్రికి, సంబంధిత కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి సమర్పించిన వినతిపత్రాలు, రాసిన లేఖలు వాటికి ప్రధానమంత్రి కార్యాలయం నుంచి, ఇతర కేంద్ర మంత్రుల నుంచి వచ్చిన సమాధానాల వివరాలను కోరారు. ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలు, వాటి భర్తీకి ఇప్పటి వరకు ఇచ్చిన నోటిఫికేషన్లు, ఖాళీల భర్తీకి తీసుకున్న చర్యలకు సంబంధించి నిర్దిష్ట సమాచారాన్ని కోరారు. తూర్పుకాపు, కొప్పుల వెలమ, కళింగ, యాదవ, మత్స్యకార, కాపు, గవర, వైశ్య బ్రాహ్మణ తదితర సామాజిక వర్గాల కార్పొరేషన్లకు కేటాయించిన బడ్జెట్ ఎంత, ఖర్చుచేసింది ఎంత వంటి సమాచారం కోరారు. గృహ నిర్మాణ పథకం, పట్టణాల్లో, గ్రామాల్లో అర్హులైన వారికి ఎన్ని ఇళ్లు నిర్మించారు.. తదితర వాటిని ఆయన కోరినట్టు ఆ ప్రకటనలో తెలిపారు.

సమ్మెను విజయవంతం చేయాలంటూ కార్మిక సంఘాల ప్రదర్శన


పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికసంఘాల నాయకులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16వ తేదీన జరిగే దేశవ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, రైతు సంఘం, రైతు కూలీల సంఘం ప్రతినిధులు బుధవారం పట్టణంలో ప్రదర్శన చేపట్టారు. అలాగే చిననాలుగురోడ్ల జంక్షన్ నుంచి రింగురోడ్డు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం, రైతు కూలీ సంఘం కన్వీనర్ అజయ్‌కుమార్, రైతు సంఘాల నాయకులు అప్పలరాజు, సంతోష్, చలపతి, దొరబాబు, శంకరరావు, గణేష్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

పోషక విలువలతో.. మిల్లెట్ పానీ పూరీ

వ్యవసాయ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రయోగం

» త్వరలో ఆర్ఏఆర్ఎస్‌లో మిల్లెట్ ఫెస్టివల్ : ఏడీఆర్


మిల్లెట్ పానీపూరీ తయారు చేస్తున్న విద్యార్థులు

అనకాపల్లి అగ్రికల్చర్, ఫిబ్రవరి 14 : నోరూరించే పానీపూరీకి కొత్త రుచులుగా పోషక విలువలు జోడించి మిల్లెట్ పానీ పూరీని రూపొందించారు అనకాపల్లి వ్యవసాయ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థులు. ఈ కొత్త స్నాక్ విశేషాలను ఆర్ఏఆర్ఎస్‌లో విద్యార్థులు బుధవారం వివరించారు. తమ ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా వీరు పానీపూరీ తయారీలో మైదాపిండి, గోధుమ పిండికి బదులు కొర్ర, రాగి, చోడి పిండిని వినియోగించారు. కొద్ది గోధుమనూకను కూడా ఈ మిశ్రమానికి కలిపారు. మైదాలో పోషక విలువలు నాస్తి అందుకే మంచి పోషక విలువలున్న చిరుధాన్యాలను మైదాకు బదులుగా వినియోగించారు. చింతపండు రసంతో తయారు చేసే పానీకి బదులు పుదీనా, కొత్తిమీర, పచ్చిమిర్చి, మిరియాల పొడి జ్యూస్‌ను వినియోగించారు. దీనికి కొద్దిపాటి చింతపండు రసాన్ని కూడా రుచి కోసం కలిపారు. ఇలా తయారు చేసే మిల్లెట్ పానీ పూరీలో రుచి, పోషక విలువలు ఉన్నాయి. అంతేకాక చెరకు రసం పానీపూరీని కూడా ప్రయోగాత్మకంగా తయారు చేశారు. చెరకు రసం - చింతపండు రసంతో మేళవించి తయారు చేసే మరో పానీపూరీ రకం కొత్తరుచినిచ్చిందంటున్నారు. పానీపూరీ తయారీలో కొద్దిగా బెల్లం పౌడర్‌ను కూడా వాడారు. ఐరన్, జింక్, కాల్షియం, మాంసకృత్తులు లభించే ఆర్ఏఆర్ఎస్ మిల్లెట్ పూరీకి ప్రాచుర్యం కల్పించేందుకు త్వరలో ఆర్ఏఆర్ఎస్‌లో మిల్లెట్ ఫెస్టివల్ నిర్వహిస్తామని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ పీవీకే. జగన్నాథరావు తెలిపారు. ఈ కొత్త వంటకాలను రూపొందించిన విద్యార్థులు ఎం. శేషసాయి, ఎం.పూర్ణిమ, ఇ.ధనలక్ష్మి, సి. గణేశ్వరి, ఎ.విజయలక్ష్మి, కె.దివ్యకుమారిలను పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్.గోపాలస్వామి అభినందించారు.

పారిశ్రామికవాడగా నక్కపల్లి అభివృద్ధి

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


శిలాఫలకం ఆవిష్కరణలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తదితరులు

అనకాపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నక్కపల్లి ప్రాంతాన్ని పారిశ్రామిక వాడగా అభివృద్ధి చేయనున్నట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. బుధవారం తాడేపల్లి నుంచి నిర్వహించిన వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నక్కపల్లి క్లస్టర్‌లో రూ.331.8 కోట్లతో 1,120 ఎకరాల్లో పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ క్లస్టర్‌లో రోడ్లు, డ్రైనేజీ పనులు, విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటు పనులు త్వరలో చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ నిర్మాణ పనులను హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టరు టెండర్ల ద్వారా పొందారన్నారు. పరవాడలో రూ.250 కోట్లతో విను టీఎస్ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ పరిశ్రమ 21.8 ఎకరాల్లో ఏర్పాటు చేసి, 500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. అంతకుముందు తాడేపల్లి నుంచి పరిశ్రమలు, ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాను పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నక్కపల్లి ప్రాంతం విశాఖపట్నం, కాకినాడకు మధ్యలో ఉన్నందున గంగవరం, కాకినాడ పోర్టులతోపాటు జాతీయ రహదారి చెంతనే ఉండడం వల్ల పారిశ్రామికంగా అభివృద్ధికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి జీఎం శ్రీధర్, ఏపీఐఐసీ జెడ్ఎం త్రినాథ్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, నక్కపల్లి జడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, ఎంపీపీ రత్నం, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరావు, సర్పంచ్ రోహిణి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలకు రాజధానిపై మాట్లాడే హక్కు లేదు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి రాజధాని ఎక్కడో ప్రజలకు చెప్పకుండా మూడు ముక్కలాట ఆడిన వైసీపీ ప్రభుత్వానికి, సీఎం జగన్మోహన్ రెడ్డికి రాజధాని గురించి మాట్లాడే నైతికహక్కు లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసాలు తప్ప అభివృద్ధి లేదన్నారు. అమరావతి రైతులు ఉద్యమిస్తున్నా వారి గురించి పట్టించుకోని సీఎం జగన్ రాజధాని కోసం భూములిచ్చిన రైతులను వేధిస్తున్నారన్నారు. రాష్ట్ర ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉండాలని ఉత్తరాంధ్ర వైసీపీ సామంత రాజు వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యానించడం దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు రాజధాని లేకుండా చేసిన వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పి, టీడీపీ, జనసేన కూటమికి అధికారం ఇవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు. ఇప్పటికైనా రాజధాని విషయంలో వైసీపీ పాలకులు మాయమాటలు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు విష్ణుచౌదరి, రమణబాబు, వెంకటరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ ఎదురుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టిన సీహెచ్‌డబ్ల్యూలు

ఆశ కార్యకర్తలుగా గుర్తించాలని దీక్షలు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 14: గ్రామాల్లో ప్రజల ఆరోగ్య రక్షణకు కృషిచేస్తున్న తమను ఆశ కార్యకర్తలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సామాజిక ఆరోగ్య కార్యకర్తలు (సీహెచ్‌డబ్ల్యూ) ఐటీడీఏ కార్యాలయం ఎదుట బుధవారం దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు మాట్లాడుతూ సీహెచ్‌డబ్ల్యూల సమస్యలపై అనేకమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు అందించినా కనీసం పట్టించుకోలేదన్నారు. దీంతో సామూహిక నిరాహార దీక్షలకు సిద్ధమయ్యారని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి సీహెచ్‌డబ్ల్యూలను ఆశ కార్యకర్తలుగా మార్చాలని, వారికి ఇచ్చినట్లే నెలకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని, రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షులు పి.దాసమ్మ, ప్రధాన కార్యదర్శి వై.మంగమ్మ, జిల్లా కమిటీ సభ్యులు పార్వతమ్మ, కాంతమ్మ, మోదకొండ, బేబిరాణి, పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు మండలాల సీహెచ్‌డబ్ల్యూలు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



అమ్మవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పాడేరు రూరల్, ఫిబ్రవరి 14: జిల్లా కేంద్రం పాడేరులోని పురాతన ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఇప్పటికే ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అనేక దేవతామూర్తుల విగ్రహాలు కొలువై ఉన్నాయి. భక్తుల సహాయంతో రాజరాజేశ్వరి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టామని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, జీజే కళాశాల ప్రిన్సిపాల్ చీపురు రమాదేవి, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల రామం, బొజ్జ వీరరాఘవులు, కృష్ణవేణి, ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, వంతినిభ రాజబాబు, పోతురాజు, శివరాత్రి శ్రీనివాస్‌కుమార్, పలాసి బాలన్న, కుర్రాడి రామారావు, కోనేరు శివ, పద్మ, ఈశ్వరమ్మ, వేణి, టీడీపీ నేత కొట్టగుళ్లి సుబ్బారావు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

పాడేరు రూరల్, ఫిబ్రవరి 14: జాతీయ నూతన విద్యా విధానం రద్దు చేయాలని విద్యార్థుల సంతకాలను సేకరిస్తున్నట్టు ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి వంతాల క్రిష్టారావు తెలిపారు. నూతన విద్యా విధానంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పగించి విద్యను వ్యాపారంగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. కస్తూరి రంగన్ జాతీయ విద్యా విధానం వల్ల ఎంతో మంది గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. తొమ్మిదో తరగతి నుంచే సెమిస్టర్ విధానం పెట్టి హైస్కూల్ విద్యార్థులను 12వ తరగతి వరకు పొడిగింపు, ఇంటర్ విద్యార్థులకు నాలుగేళ్లు పెంచి డిగ్రీ విద్యార్థులను అయోమయంలో నెడుతున్నారన్నారు. ఈ విధానం వల్ల రిజర్వేషన్లు కోల్పోవాల్సి ఉంటుందన్నారు. నూతన విద్యా విధానాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కె.దేవదాస్, పి.మత్స్యరాజు, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శభాష్ మంగ్లు!

... 5వ పేజీ తరువాయి

విత్తనాలను నాటి 'గులి' పద్ధతి కంటే అధిక దిగుబడి సాధించింది. దీంతో ఈ తరహా సాగుకు 'జమున' అని పేరుపెట్టారు. దీనిపై గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జడ్‌బీఎన్ఎఫ్ స్టేట్ రిసోర్స్ పర్సన్ అమ్మాజీ, ప్రభుత్వానికి డాక్యుమెంటరీ సమర్పించారు. దీనికి ప్రభుత్వ గుర్తింపు కూడా లభించింది.

మంగ్లు చేపట్టిన జమున సాగు విధానం..

మంగ్లు.. ఎకరం పొలాన్ని రెండు, మూడుసార్లు బాగా మెత్తగా దున్నుకుని ఆఖరి దుక్కిలో ఘనజీవామృతం 250 కిలోలు వేశాడు. అడుగు వెడల్పు, అడుగు పొడవు పాటిస్తూ రాగి విత్తనాలను పొలంలో నేరుగా నాటుకున్నాడు. 15 రోజుల తరువాత పెరిగిన మొక్కల్లో బలమైన రెండు మొక్కలు మాత్రమే ఉంచి మిగిలిన మొక్కలను తొలగించాడు. 20 రోజుల తరువాత మొక్కల మీద నుంచి పట్టె(చిన్నపాటి దుంగను) లాగి మొక్కలు కొద్దిగా వంగేలా చేశాడు. 40 రోజులకు మరోసా పట్టె లాగాడు. ఈ విధంగా చెయ్యడం వల్ల మొక్కలు ఏపుగా ఎదిగి అధిక కణుపులు వస్తాయని మంగ్లు తెలిపాడు. 60 రోజులకు వరుసల మధ్య దుక్కిచేశాడు. విత్తనాలు వేసిన 50 రోజులకు, 90 రోజులకు 250 లీటర్ల చొప్పున జీవామృతాన్ని మొక్కలపై పిచికారీ చేశాడు. ఆగస్టు మొదటి వారంలో విత్తనాలు వేయగా, డిసెంబరు రెండో పక్షంలో పంట కోతకు వచ్చింది. నూర్పు చేయగా 13 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

శాస్త్రీయ పద్ధతిలో రాగి సాగుకు ప్రోత్సాహం

-కంటా జాహ్నవి, ఏడీఏ, చింతపల్లి

గిరిజన ప్రాంతంలో నూతన శాస్త్రీయ పద్ధతుల్లో రాగి సాగుని ప్రోత్సహిస్తున్నాం. జమున, గుళి పద్ధతుల్లో సాగు చేపడితే అధిక దిగుబడులు వస్తున్నాయి. రైతులు ఈ పద్ధతిలో రాగి సాగు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. విత్తనం నాటి నుంచి పంట కోసే వరకు వ్యవసాయ అధికారులు, వీఏఏల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యల గురించి తెలియజేస్తున్నాం. ఈ ఏడాది రాగి సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశాం.

ఉద్యోగాల పేరుతో ఖాకీ చీటింగ్

- పోలీసు శాఖ, డాక్ యార్డులో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులకు బురిడీ
- సోదరుడితో కలిసి పలువురి నుంచి రూ.30 లక్షలకు పైగా వసూలు
- ఎంతకాలమైనా ఉద్యోగాలు రాకపోవడంతో నిలదీసిన బాధితులు
- డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో స్పందనలో ఫిర్యాదు
- ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన చోడవరం పోలీసులు
- విశాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రధాన నిందితుడు

చోడవరం, ఫిబ్రవరి 14: పోలీస్ శాఖ, విశాఖలోని నేవల్ డాక్ యార్డులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురు నిరుద్యోగుల నుంచి రూ.30 లక్షలకుపైగా వసూలు చేసి మోసగించిన పోలీస్ కానిస్టేబుల్, అతని సోదరుడిపై చోడవరం పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి సీఐ బి.శ్రీనివాసరావు బుధవారం తెలిపిన వివరాలిలా వున్నాయి.

చోడవరం పట్టణంలోని దుడ్డువీధికి చెందిన కశిరెడ్డి రమణమూర్తి విశాఖ నగర పరిధిలోని కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తన సోదరుడు మోహన్‌బాబుతో కలిసి పోలీసు శాఖలో, విశాఖలోని నేవల్ డాక్ యార్డులో ఉద్యోగాలు ఇప్పిస్తామని చోడవరం నౌడువీధికి చెందిన దోకల మోహనరావు, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని మరికొంతమంది నిరుద్యోగులకు చెప్పారు. వీరు చెప్పిన మాటలను నమ్మిన పలువురు నిరుద్యోగులు 2021 నవంబరు నెలలో ఒక్కొక్కరు రూ.4-5 లక్షలు ఇచ్చారు. డబ్బులు తీసుకున్న రమణమూర్తి, మోహన్‌బాబు.. ఎన్ని రోజులైనా ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో నిరుద్యోగులు నిలదీశారు. వెంటనే ఉద్యోగాలు ఇప్పించాలి, లేదంటే డబ్బులు వెనక్కి ఇవ్వాలని పట్టుబట్టారు. కానీ వారు స్పందించకపోవడంతో బాధితులు గత నెలలో విశాఖ కలెక్టరేట్ స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును కలెక్టరేట్ అధికారులు విశాఖ పోలీసు కమిషనర్‌కు, అక్కడి నుంచి అనకాపల్లి జిల్లాకు పంపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చోడవరం పోలీసులు ఇటీవల బాధితులను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అనంతరం వారి నుంచి ఫిర్యాదు స్వీకరించి కానిస్టేబుల్ రమణమూర్తి, అతని సోదరుడు మోహన్‌బాబులపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

గూడు నిర్మించరు.. గోడు వినరు!

- సుత్తిగూడలో అసంపూర్తి పాఠశాల భవనం
- అందులోనే ఇరుకు ప్రాంతంలో విద్యా బోధన
- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు.. పట్టించుకోని అధికారులు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 14: రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు సంపూర్ణ విద్యనందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని గొప్పలు చెబుతున్నా, ఆచరణలో కనిపించడం లేదు. మండలంలోని పలు గ్రామాలలో విద్యా బోధనకు కనీసం భవనాలు లేక ఇరుకు ప్రాంతంలో బిక్కుబిక్కుమంటూ చిన్నారులు చదువుకోవడమే ఇందుకు నిదర్శనం.

లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని సుత్తిగూడ గ్రామంలో విద్యార్థులకు చదువుకొనేందుకు గూడు కరువైంది. గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో సుమారు 45 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే కాలం చెల్లిపోవడంతో ఉన్న పాఠశాల భవనాన్ని నేలమట్టం చేశారు. ఆ భవనాన్ని తొలగించి సుమారు ఐదేళ్లు గడిచినా నూతన భవనాన్ని నిర్మించలేదు. దాని కారణంగా ప్రస్తుతం పలు తరగతుల విద్యార్థులు వంటశాల గదిలోని, అసంపూర్తిగా ఉన్న భవనంలోని విద్యనభ్యసించాల్సిన దుస్థితి నెలకొంది. నాడు-నేడు నిధులు మంజూరు చేశారని, అయితే కొద్దిపాటి పనులు జరిగిన తరువాత వివిధ కారణాలను చూపుతూ నిధులు రద్దు చేశారని పంచాయతీ సర్పంచ్ కె.త్రినాథ్ తెలిపారు. దీంతో ఆ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయని,



అసంపూర్తిగా ఉన్న ఇరుకు భవనంలో చిన్నారులకు పాఠాల బోధన దృశ్యం

ఈ విషయంపై స్పందనలో సుమారు ఐదుసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు పాఠశాలకు పక్కా భవన సౌకర్యం లేకపోవడంతో ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న భవనం, వంటశాలలో తరగతులను నిర్వహించడం వల్ల పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. కాలం ఏదైనా విద్యార్థులకు కష్టాలు తప్పడంలేదు. అధికారులు స్పందించి నాడు నేడు ద్వారా పనులు జరిగే విధంగా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రమాదరహితంగా వాహనాలు నడపాలి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 14: డ్రైవర్లు ప్రమాదరహితంగా వాహనాలు నడపాలని సీఐ దేవరపల్లి నవీన్‌కుమార్ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక పీటీడీ డిపోలో డీఎం వేదుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు అసౌకర్యానికి గురికాకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని విడనాడాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. అందువల్ల వీటికి దూరంగా ఉండాలని కోరారు. అనంతరం డిపోలో ప్రమాదరహితంగా వాహనాలు నడిపిన ముగ్గురు ఉత్తమ డ్రైవర్లు కె.కొండబాబు (ప్రథమ), డి.శ్రీనివాసరావు (ద్వితీయ), వి.చిన్నారావు (తృతీయ)కు బహుమతులతో పాటు అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ ఇన్‌చార్జి డీవీ.శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌చార్జి డి.అప్పారావు, గ్యారేజ్ మెకానికల్ ఇంజనీర్ వి.రమణ, మార్కెట్ ఎగ్జిక్యూటివ్ కేవీఎస్ఎన్.రాజు, సిస్టం సూపర్‌వైజర్ టీఆర్‌వీ.ప్రసాద్, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే.వల్లీ, యూనియన్ ప్రతినిధులు తురుక్ గంగాధరరావు, కేఎస్.చలం, టీకే.రావు, చందు పాల్గొన్నారు.



ప్రమాద రహిత (ఉత్తమ) డ్రైవర్లకు సన్మానించిన సీఐ నవీన్, డీఎం శ్రీనివాస్

కాడెలిలో టీడీపీ నేతల 'శంఖారావం'

పాడేరు రూరల్, ఫిబ్రవరి 14: మండలంలోని కాడెలి పంచాయతీ వర్తనాపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు బుధవారం శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నేత కొట్టగుళ్లి సుబ్బారావు మాట్లాడుతూ మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి, రాష్ట్రాభివృద్ధిని తుంగలో తొక్కారన్నారు. స్వర్ణాంధ్రాగా మారాల్సిన ఆంధ్రప్రదేశ్‌కు నేడు రాజధాని కూడా లేకుండా చేసిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను మోసగించిన జగన్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో గిరిజన ప్రాంతం అభివృద్ధికి కృషి చేసే టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎం.మణికుమారి, నాయకులు వర్తన పిన్నయ్యదొర, డప్పోడి అప్పలస్వామి, ఎస్.తిరుపతి, రేమల నాగరాజు, డప్పోడి భవాని, లకే తేజవతి, ఎస్.లక్ష్మమ్మ పాల్గొన్నారు.

తమ్ముడిపై కత్తితో దాడి

పెదబయలు, ఫిబ్రవరి 14: మండలంలోని పోయిపల్లి పంచాయతీ సంపంగిపుట్టు గ్రామంలో అనుమానంతో తమ్ముడిపైనే అన్న కత్తితో దాడిచేసి గాయపరిచాడు. గ్రామానికి చెందిన పాతుని పోట్టన్న తన భార్యకు అదే పంచాయతీ లగిసిపల్లి గ్రామంలో ఉన్న తమ్ముడు శివన్నతో వివాహేతర సంబంధం ఉందని అనుమానం పెంచుకున్నాడు. దీంతో పెద్దలను ఆశ్రయించగా, వారు ఇరు పక్షాలకు సర్దిచెప్పారు. అయినప్పటికీ తమ్ముడు శివన్నపై కోపం తగ్గని పోట్టన్న లగిసిపల్లి గ్రామానికి వెళ్లి కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన ముంచంగిపుట్టు పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అక్కడి నుంచి పాడేరు జిల్లా ఆసుపత్రికి పంపించారు. మెరుగైన వైద్య సేవల కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

పెరుగుతున్న చలి తీవ్రత

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 14: ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో చలి తీవ్రత పెరిగింది. మండల కేంద్రంలో బుధవారం ఉదయం పది గంటల వరకు మంచు దట్టంగా కమ్ముకుంది. దీంతో ఎదురెదురు వాహనాలు దగ్గరకు వస్తేగాని గుర్తించలేని పరిస్థితి ఏర్పడింది. వాహనచోదకులు పట్టపగలు లైట్ల వెలుగులో రాకపోకలు సాగించాల్సి వచ్చింది. రోజు రోజుకు చలితీవ్రత పెరగడంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో మాత్రం ఎండ ఠారెత్తిస్తున్నది. ఉక్కపోతకు ప్రజలు విలవిలలాడిపోతున్నారు. ఉదయం మంచు, మధ్యాహ్నం ఎండ కారణంగా పలు రకాల అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిసారించాలి

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 14: పాఠశాల వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం దృష్టిసారించాలని గిరిజన సంఘం నాయకుడు కె.శంకరరావు డిమాండ్ చేశారు. మండలంలోని దోడిపుట్టు పంచాయతీ అడాల్‌పుట్టు గ్రామానికి చెందిన జి.కనకమ్మ పాడేరు ఏకలవ్య బాలికల పాఠశాలలో ఏడో తరగతి చదువుతూ అనారోగ్య కారణంగా విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. విద్యార్థిని మృతదేహానికి బుధవారం స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. బాధిత కుటుంబ సభ్యులను గిరిజన సంఘంతో పాటు పలు సంఘాల నాయకులు పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా శంకరావు మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం కనీస దృష్టిసారించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులు మృతి చెందుతున్నారని వాపోయారు. బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవికి పూజలు



పాడేరు: అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 14: వసంత పంచమిపవిత్ర దినాన్ని పురస్కరించుకుని స్థానిక అక్షర పాఠశాలలో చదువుల తల్లి సరస్వతీదేవికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు శాస్త్రోక్తంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. వందలాది మంది తమ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ట్రస్ట్ చైర్మన్, ట్రస్ట్ సభ్యులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుకుంపేటలో...

హుకుంపేట: మండల కేంద్రంలోని విజ్ఞాన భారతి పాఠశాలలో బుధవారం సర్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. సర్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నారులతో తల్లిదండ్రులు అక్షరాభ్యాసాలు చేయించారు.

ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్టు

- నాలుగు బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

సీలేరు, ఫిబ్రవరి 14: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి చిత్రకొండ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిత్రకొండ సమీపంలో బుధవారం వాహనాలను తనిఖీలు చేస్తుండగా, ఆంధ్రా రిజిస్ట్రేషన్‌తో ఉన్న రెండు బైకులపై ఉన్న నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా రెండు బైకులను ఆంధ్రాలో దొంగిలించినట్టు తెలిపారు. అరెస్టయిన వారిలో పశ్చిమగోదావరి జిల్లా తణుకు చెందిన పి.కుమార్‌శివ, అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అప్పర్ గోతులుకు చెందిన కోడా సురేష్ బాబు, తూర్పుగోదావరి జిల్లా కొత్తపేటకు చెందిన ఎ.హరిసూర్య శ్రీకాకుళం జిల్లా జడుమూరుకు చెందిన ఆనందవరపు, ప్రసాద్ ఉన్నట్టు ఒడిశా పోలీసులు తెలిపారు.

పాత పింఛన్ విధానం అమలుచేయాలి

- ఏపీ జేఏసీ తాలూక అధ్యక్షుడు మురళి



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

చింతపల్లి, ఫిబ్రవరి 14: ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలని ఏపీ జేఏసీ చింతపల్లి తాలూక అధ్యక్షుడు ఎల్.మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జేఏసీ ఉద్యోగులు సమావేశమయ్యారు. అనంతరం డిమాండ్లను నెరవేర్చాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే మంజూరు చేయాలన్నారు. 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో తాలూక కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ జోనల్ కార్యదర్శి బి.గంగరావు పడాల్, మండల అధ్యక్షుడు చంద్రశేఖరరావు, అసోసియేట్ అధ్యక్షుడు పి.బాలరాజు పాల్గొన్నారు.

జాములువీధిలో శ్రమదానంతో రహదారి నిర్మాణం

జి.మాడుగుల, ఫిబ్రవరి 14: బొయితిలి పంచాయతీ జాములువీధి గ్రామస్థులు శ్రమదానంతో రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ గ్రామానికి కనీస రహదారి సౌకర్యం లేక పోవడం.. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులే చేయి చేయి కలిపి శ్రమదానానికి పూనుకున్నారు. ప్రధాన రహదారి నుంచి జాములువీధికి కిలోమీటరు మేర కాలిబాటనే రాకపోకలు సాగిస్తున్నామని గ్రామానికి చెందిన వార్డు సభ్యులు డి.బుల్లిదొర, స్థానికులు రమణబాబు, రాధాకృష్ణ విలేకరులకు తెలిపారు. అత్యవసర సేవలు అందడం లేదని, అనారోగ్యాలకు గురైనప్పుడు డోలీమోతలు తప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి నిర్మించాలని పాడేరు ఎమ్మెల్యేను కోరినా సమస్య పరిష్కరించలేదని వాపోయారు. చేసేదిలేక శ్రమదానంతో తాత్కాలిక రహదారి పనులు చేపట్టామన్నారు. రాజకీయ నేతలు, అధికారులు స్పందించి పక్కా రహదారి నిర్మించాలని వార విన్నవించారు.



శ్రమదానంతో రహదారి పనులు చేపడుతున్న జాములవీధి గ్రామస్థులు

గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- జడ్పీ కార్యాలయ ఆవరణలో గిరిజనులు వినూత్న నిరసన

విశాఖపట్నం, ఫిబ్రవరి 14: గిరిజన గ్రామాలకు సాగు, తాగునీరు, కరెంటు, రహదారులు తదితర వసతులు కల్పించాలని కోరుతూ, విశాఖలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట గిరిజనులు వినూత్నంగా నిరసన తెలిపారు. జడ్పీ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆదివాసీలు అడ్డాకులు ధరించి, కాగడాలు, డోలీలతో తమ నిరసనను వ్యక్తం చేశారు.



డోలీలు, ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ పరిధి బూరె, చినకోనల తదితర గ్రామాలకు రోడ్డు, కరెంటు సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోయారు. తమ భూములను స్థానిక రెవెన్యూ అధికారులు రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మకై గిరిజనేతరులకు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. తమ భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పెదకోట, పినకోట కివర్ల పంచాయతీ పరిధి 12 గిరిజన గ్రామాల ప్రజలు శ్రమదానంతో 13 కిలో మీటర్ల మేర రహదారి నిర్మించుకున్నట్టు చెప్పారు. ఆ గిరిజన ప్రాంతాలలో రోడ్లు, తాగునీరు , కరెంటు సౌకర్యం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. పలువురు యువకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుతో ప్రజలను హాని జరిగితే సహించం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు

సీలేరు, ఫిబ్రవరి 14: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్మాణంతో పరిసర ప్రాంతాల ప్రజలకు ఎటువంటి హానీ జరిగినా సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు అన్నారు. పంప్డ్ స్టోరేజీ వల్ల ప్రజలకు ఎటువంటి నష్టం వాటిల్లినా, ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇటీవల కొంత మంది జెన్‌కో అధికారులు ప్రాజెక్టు పేరు చెప్పి సీలేరు పరిసర ప్రాంతాల ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. చింతపల్లి మండలం ఎర్రవరం పవర్ ప్రాజెక్టు పరిస్థితి సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు రాకుండా అధికారులు ప్రజలతో సమన్వయంగా మెలగాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో అధికారులు ప్రజలకు ఇచ్చిన హామీలకు లోబడే చర్యలు చేపట్టాలని, ప్రజలకు అన్యాయం చేస్తే వారికి అండగా ఉండి పోరాడతామని చెప్పారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంలోనే విద్యార్థుల మరణాలు

- పాడేరు ఐటీడీఏ పీవోను సస్పెండ్ చేయాలి
- సీపీఐ మావోయిస్టు నేత అరుణ

జి.మాడుగుల, ఫిబ్రవరి 14: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని సీపీఐ మావోయిస్టు విశాఖ, అల్లూరి, అనకాపల్లి (వీఏఏ) డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. విశాఖ జిల్లా మారికవలస గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న 12 ఏళ్ల ప్రదీప్ మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతూ వైద్యం అందక మృతి చెందాడని, ఇలా ఒక్క నెలలోనే నలుగురు విద్యార్థులు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మరణాలపై విచారణ జరిపిస్తామని ఒక ప్రకటనతో ముగిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలపై ప్రజా సంఘాల ఆందోళనలు, నిరసనలను లేనిపోని నిబంధనలు పెట్టి అణచివేశారన్నారు. విద్యార్థుల మరణాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఐటీడీఏ పీవోకు తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆశ్రమ విద్యార్థులకు నాణ్యమైన మెనూ అమలు చేయాలని, అనారోగ్యానికి గురైన విద్యార్థులకు సరైన వైద్య సేవలు అందించాలని, డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ చొరవతో గిరిజనులకు పక్కా గృహాలు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వ చొరవతో గిరిజనులకు పక్కా గృహాలు మంజూరవుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు కిరసాని రమేష్ పేర్కొన్నారు. మండలంలోని కితలంగి పంచాయతీలో పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. గిరిజనులతో ఆయన మాట్లాడి కేంద్ర ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గిరిజన రైతులను వ్యవసాయ రంగంలో ఆదుకునేందుకు ప్రతి ఏటా పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తున్నదని చెప్పారు. గిరిజన గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్న బీజేపీని రానున్న ఎన్నికల్లో అధికారంలో తీసుకొచ్చి అభివృద్ధికి బాటలు వేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో అరకు అసెంబ్లీ నియోజకవర్గ కో-కన్వీనర్ బలరాం, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సద్దు, మండల ఉపాధ్యక్షుడు మహేంద్రం, నాయకుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగిలిసింగిలో కాంగ్రెస్ ప్రచారం

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 14: మండలంలోని రంగిలిసింగి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ చైర్మన్ శాంతకుమారి ఆదేశాల మేరకు పార్టీ మండల ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్నాథం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తుందన్నారు. ఉపాధి హామీ చట్టం పటిష్ఠంగా అమలు చేయడానికి పూనుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

డీఏవీ పాఠశాలలో పంచమి వేడుకలు

సీలేరు, ఫిబ్రవరి 14: సీలేరు డీఏవీ పాఠశాలలో బుధవారం శ్రీపంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగనమశ్శివాయ ఆధ్వర్యంలో విద్యార్థులతో సరస్వతీదేవికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచమి విశిష్టతను హిందీ ఉపాధ్యాయుడు భాస్కరరావు వివరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 14: చింతపల్లి-పెదవలస రహదారి అసరాడ గ్రామ సమీపంలో ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే కొట్నాపల్లి గ్రామానికి చెందిన పాతుని గోవింద్ ద్విచక్ర వాహనంలో పెదవలస నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. పెంటపాడు గ్రామానికి కొరియర్ బాయ్ రవి ద్విచక్ర వాహనంలో పెదవలస వెళుతున్నాడు. రెండు వాహనాలు అసరాడ మలుపు వద్ద బలంగా ఢీకొన్నాయి. దీంతో గోవింద్, కొరియర్ బాయ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు ప్రైవేటు వాహనంలో చింతపల్లి ఆస్పత్రికి తరలించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 14: చింతపల్లి మండలంలో సోమవారం జరిగిన జీపు ప్రమాదంలో గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని చైతన్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెనుమాక రవికుమార్, డైరెక్టర్ డాక్టర్ హేమనాయిక్ కోరారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న తొమ్మిది మంది క్షతగాత్రులను బుధవారం వారు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. క్షతగాత్రులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు గోపాలపాత్రుడు, అరిమెలరాజు, చందరరావు పాల్గొన్నారు.